రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అతి స్వల్ప కాలంలోనే అత్యధిక మంది పాఠకుల మన్ననలు పొందుతూ ముందుకు దూసుకెళ్తున్న క్విక్ టుడే దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

EDITOR:
G.BUCHI REDDY
8125972476



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక

QUICK TODAY TV తెలుగు 8125972476

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 235 | సోమవారం | 03-06-2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8

MALKAJGIRI | Volume: 3 | Issue: 235 | Monday | 03-06-2026 | Price: ₹3/- | Pages: 8


# ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ

### శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో సమావేశం

### రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై చర్చ!



**హైదరాబాద్, మే31(క్విక్ టుడే న్యూస్):**
ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్వహ◌ారాల ఇంఛార్జ్ మీనాక్షీనటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశం సుమారు గంటన్నర పాటు కొనసాగింది. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. న్యూఢిల్లీ నుంచి కర్ణాటకలోని గుల్బర్గా వెళ్తున్న సందర్భంగా ఖర్గే హైదరాబాద్‌లో ఆగగా, ఈ సమావేశం జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) వెల్లడించింది. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రవేశపెడుతున్న



ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం

మిగతా 2లో

### నేడు ఆసిఫాబాద్ జిల్లాలో

# సీఎం పర్యటన

**లక్షఇండ్లకు సామూహిక గృహ ప్రవేశాలు**

**రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**

**2.50 లక్షల ఇండ్లను ప్రారంభించనున్న రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మే31(క్విక్ టుడే న్యూస్):**
ఆసిఫాబాద్ జిల్లా కొరారి గ్రామ పంచాయతీ నుంచి సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను ప్రాంరంభించనున్నారు. అంతేకాకుండా మొదటి

మిగతా 2లో



# వరుసగా రెండోసారి ఆర్సీబీ

**ఐపీఎల్ చాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**

**గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ విజయం**

**విరాట్ కోహ్లీ అజేయ అర్ధశతకం**

**అహ్మదాబాద్, మే31:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 155 పరుగులు చేసింది.156 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన ఆర్సీబీకి అదిరిపోయే ఆరంభం లభించింది. ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా కోహ్లీ, తన మణికట్టు మాయాజాలంతో అద్భుతమైన ఫ్లిక్స్, పుల్ షాట్లతో

మిగతా 2లో

# ఉచిత విద్యుత్ రద్దుకు ప్లాన్

**రైతు డిస్కం అన్నదాతల మెడకు ఉరితాడు**

**24 గంటల ఉచిత విద్యుత్ అందించిన నేత కేసీఆర్**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుపడిన కేటీఆర్**



**హైదరాబాద్, మే31(క్విక్ టుడే న్యూస్)::;**
'రైతు డిస్కం' అనేది రైతన్నల మెడకు ఉరితాడు లాంటిదని, దీని ద్వారా ఉచిత విద్యుత్‌ను శాశ్వతంగా రద్దు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు, పారిశ్రామిక సెలవులతో (ఇండస్ట్రియల్ హాలిడేస్) రాష్ట్రం అతలాకుతలం అయిందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కానీ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన 6 నెలల్లోనే ఆ దుస్థితిని మార్చి, 79 ఏళ్ల భారత చరిత్రలో వ్యవసాయానికి 24 గంటల

మిగతా 2లో



# త్వరలోనే గుడ్ డీల్

**ఇరాన్-అమెరికా మధ్య మంచి ఒప్పందం**

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన**

**వాషింగ్టన్, మే31:**
అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందం కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం కీలక ప్రకటన చేశారు. త్వరలో ఇరాన్–అమెరికా మధ్య మంచి ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్నారు. ట్రంప్ ఒక మీడియా సంస్థతో మాట్లాడారు. 'ఇరాన్‌తో ఒక మంచి డీల్ కుదుర్చుకునేందుకు దగ్గరగా ఉన్నాం. కానీ, ఒకవేళ చర్చలు విఫలమైతే సైనిక చర్య అనే మార్గం ఇంకా తెరిచే ఉంది. మేం మళ్లీ

మిగతా 2లో

### రైతు డిస్కం వెనుక

# పెద్ద కుట్ర

**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై చిట్‌చాట్‌లో కాదు**


**సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలి**

**టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్**



**హైదరాబాద్, మే31(క్విక్ టుడే న్యూస్):**
రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం

మిగతా 2లో



### నేటి నుంచి నూతనంగా

# దక్షిణ కోస్తా రైల్వే జోన్

**విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభం**

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ సోమవారం అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్

మిగతా 2లో

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆటోను బలంగా ఢీకొట్టిన కంటైనర్ లారీ**

**ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే మృతి**



**బెంగళూరు, మే31:**
కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి పట్టణం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి

మిగతా 2లో

### రైతు డిస్కంపై

# సీఎం పచ్చి అబద్ధాలు

**రైతు డిస్కమ్‌తో సాగుకు ఉరితాడు**

**విద్యుత్తును ప్రైవేట్‌పరం చేసే కుట్ర**

**తక్షణమే అసెంబ్లీలో చర్చపెట్టాలి**

**బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్**

2



RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

సోమవారం 1 జూన్ 2026

quicktodaynews.com



తరువాయి పేజీ..




### రైతు డిస్కం వెనుక

# పెద్ద కుట్ర

బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

### నేటి నుంచి నూతనంగా

# దక్షిణ కోస్తా రైల్వే జోన్

ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# త్వరలోనే గుడ్ డీల్

తిరిగి వెళ్లి ఇరాన్‌ను అంతం చేస్తాం. ఇరాన్‌తో కుదుర్చుకునే ఏ ఒప్పందమైనా సరే.. అణ్వాయుధ దేశంగా ఉండటానికి మాత్రం అంగీకరించం. మేం కావాలనే వారి సైన్యాన్ని ఓడించాం. నేను ఒప్పందానికే ఇష్టపడతా. ఎందుకంటే సంతకం అయిన వెంటనే హార్ముజ్ జలసంధిని వెంటనే తెరవవచ్చు. కానీ, ఆ దేశానికి అణ్వాయుధాలు ఉండవు అనే విషయంలో నేను హామీ ఇవ్వగలను. దీనికి వాళ్లు అంగీకరించారు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ద్వైపాక్షిక చర్యల ద్వారా ఒప్పందం కుదుర్చుకుంటే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుతాయన్నారు. హార్ముజ్ జలసంధి తెరవడం, సముద్ర మార్గంలో భద్రత వంటి అంశాలపై ఇరాన్–అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఇరాన్‌తో చర్చలకు తొందరేమీ లేదని ఇటీవల ట్రంప్ వెల్లడించారు. చర్చలు చాలా నెమ్మదిగా సాగుతున్నాయన్నారు. శాంతి చర్చలు విఫలమైతే సైనిక చర్యకు అవకాశం ఉందన్నారు.

### ఉచిత విద్యుత్

# రద్దుకు ప్లాన్

ఉచిత విద్యుత్ అందించిన ఏకైక నేతగా నిలిచారన్నారు. కేసీఆర్ గుర్తులు చెరిపేస్తానంటున్న రేవంత్ రెడ్డి, చివరికి రైతన్నల నోటికాడి కూడును లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ రైతు వ్యతిరేక కుట్రలపై ప్రజలు కూడా స్పందించి రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిజంగా దమ్ముంటే, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసిన తర్వాతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఛాలెంజ్ చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం జరిగిన సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయనంటూ సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు ముమ్మాటికి అబద్ధాలన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు 3 గంటల కరెంట్ సరిపోతుందని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక 24 గంటల ఉచిత కరెంట్‌ను పూర్తిగా ఎగగొట్టేందుకే రైతు డిస్కం పేరుతో కొత్త కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో, రేవంత్ రెడ్డికి రైతులపై అంతే ప్రేమ ఉందంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

వెళితే, పని ముగించుకుని సుమారు 15 మంది కూలీలు ఒక ఆటోలో ఇంటికి బయలు దేరారు. జాతీయ రహదారి 44పై గంగోత్రి పెట్రోల్ పంప్ వద్దకు రాగానే, వేగంగా వస్తున్న ఒక కంటైనర్ లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఆరుగురు అక్కడి కక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సామర్థ్యానికి మించి ఆటోలో ప్రయాణించడం, లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణాలని ప్రాథమికంగా భావిస్తున్నారు.

### ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో

# సీఎం రేవంత్ భేటీ


నిర్వహించనున్నారు. ఈ పథకాన్ని ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు చేయనున్నారు. ట్రస్ట్‌లో మొత్తం ఎనిమిది మంది సభ్యులు ఉండగా, ఉద్యోగుల సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల సంఘాల నుంచి ఇద్దరు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తారు. 3.56 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, 2.88 లక్షల పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కలిపి మొత్తం 17.07 లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. ఈ పథకం కింద అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, 652 ఎంపానెల్డ్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయి క్యాష్‌లెస్ వైద్య సేవలు అందుబాటులో ఉండనున్నాయి. మొత్తం 1,998 వైద్య ప్రక్రియలు ఈ పథకం పరిధిలోకి వస్తాయి. ఉద్యోగులు తమ మూల వేతనంలో 1.5 శాతం చొప్పున వాటా చెల్లించనుండగా, ప్రభుత్వం కూడా సమాన మొత్తాన్ని జమ చేస్తుంది. ఈ పథకం అమలుకు సంవత్సరానికి రూ.1,056 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.



# వరుసగా రెండోసారి ఆర్సీబీ

కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. మరోవైపు, కుడి మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పటికీ వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 32) దూకుడుగా ఆడాడు. ఈ జోడీ కేవలం 21 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఐపీఎల్ ఫైనల్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. అయితే, వెంకటేశ్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో ఆర్సీబీ కాస్త నెమ్మదించింది. రజత్ పాటిదార్ (14) కొన్ని చక్కటి షాట్లు ఆడినప్పటికీ, రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో పటీదార్‌ను, కృనాల్ పాండ్యా (0)ను ఔట్ చేసి మ్యాచ్‌లో ఉత్కంఠ పెంచాడు. ఈ దశలో కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ కోహ్లీ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కేవలం 25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని జట్టుపై ఒత్తిడిని తగ్గించాడు. టిమ్ డేవిడ్ (11) కూడా త్వరగానే ఔటయినా, కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 63 పరుగుల వద్ద శుభ్‌మన్ గిల్ పట్టిన డైవింగ్ క్యాచ్‌ను రీప్లేలలో బంతి నేలను తాకినట్లు తేలడంతో కోహ్లీకి లైఫ్ లభించింది. ఆ తర్వాత, అర్షద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో ఒక ఫోర్, ఒక సిక్సర్ బాది ఆర్సీబీకి





ఘనవిజయాన్ని అందించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేసింది. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో) ఒంటరి పోరాటం చేసి అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో సత్తా చాటగా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఆర్సీబీ, ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ అరుదైన ఘనత సొంతం చేసుకోవడం విశేషం. ఆర్సీబీ ఈ విజయంతో... వరుసగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల సరసన చేరింది. కెప్టెన్ గానూ రజత్ పటీదార్ వరుసగా రెండు టైటిళ్లతో రికార్డు పుటల్లోకెక్కాడు. సీఎస్కే జట్టు 2010, 2011లో వరుసగా టైటిళ్లు గెలవగా... ముంబై ఇండియన్స్ 2019, 2020లో విజేతగా నిలిచింది. ఆర్సీబీ 2025, 2026లో టైటిళ్లు గెలిచి ఆ రెండు జట్ల సరసన చేరింది. 2025లో ఇదే స్టేడియంలో తొలి టైటిల్ గెలుచుకున్న ఆర్సీబీ.. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ తర్వాత తమ టైటిల్‌ను నిలబెట్టుకున్న మూడో జట్టుగా చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా, మహిళల ప్రీమియర్ లీగ్ (WPL), ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) టైటిళ్లను ఒకేసారి కలిగి ఉన్న ఏకైక ఫ్రాంచైజీగా అరుదైన ఘనత సాధించింది. క్వాలిఫయర్–1లో గెలిచిన జట్టే ట్రోఫీని గెలుచుకోవడం ఇది వరుసగా తొమ్మిదోసారి కావడం విశేషం.

### నేడు ఆసిఫాబాద్ జిల్లాలో

# సీఎం పర్యటన

విడతలో పూర్తయిన లక్షఇందిరమ్మ ఇండ్లకు సామూహిక గృహ ప్రవేశాలను కూడా చేయనున్నారు. కాగా రెండో విడుతలో మరో 2.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా రెండో విడతలో మొదటి విడతకు భిన్నంగా గుడిసెలు, రూఫ్ టాప్ లేని ఇళ్లు, గోడల దశల్లో నిలిచిపోయిన ఇళ్లకు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించారు. రెండో విడత ఇండ్ల పంపిణీలో తొలి ప్రాధాన్యం వారికి ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో భాగంగా మొత్తం 100 నియోజకవర్గాల్లో (జీహెచ్ఎంసీ మినహాయింపు) నియోజకవర్గానికి 1,500 చొప్పున 1,50,000 ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. వీటిలో నియోజకవర్గానికి 500 చొప్పు 100 నియోజకవర్గాలకు కలిపి 50వేల ఇండ్లను రూఫ్ రీప్లేస్మెంట్, షెల్టర్ అప్ గ్రేడేషన్‌కు అవకాశం కల్పించనున్నారు. రాష్ట్ర రిజర్వ్ కోటా కింద మరో 50వేల ఇళ్లను (కొత్త ఇళ్లు 30వేలు, రూఫ్ రీప్లేస్మెంట్ కింద 20వేలు) కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వివిధ సర్వేల ప్రకారం.. రాష్ట్రంలో దాదాపు 15వేల కుటుంబాలు గుడిసెల్లో నివసిస్తున్నారు. అయితే, రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో వీరందరికీ మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఇళ్లు మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

దీనికితోడు గోడలు, స్లాబుల దశల్లో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసుకునేందుకు రూ.2లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు త్వరలో విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. గెజిటెడ్ అధికారులతో అర్హుల ధ్రువీకరణ.. ఆ తరువాత జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రుల ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఆ తరువాతనే లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేస్తారు.

